# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 376 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 01, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ప్రధానిపై సభాహక్కుల నోటీసు



**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ రికార్డుల నుంచి తొలగించినప్పటికీ ఆ వ్యాఖ్యలున్న వీడియోను సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేసిన ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ ఎంపి చరణ్‌జిత్ సింగ్ చన్నీ బుధవారం సభా హక్కుల తీర్మానానికి నోటీసు అందచేశారు. మంగళవారం లోక్‌సభలో కేంద్ర బ్జడెట్‌పై అనురాగ్ ఠాకూర్ ప్రసంగిస్తూ పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేయగా వీటిని సభాధ్యక్షుడు రికార్డుల నుంచి తొలగించారు. ఈ వ్యాఖ్యలపై సభలో తీవ్రస్థాయిలో రభస జరిగింది. కాగా..రికార్డుల నుంచి తొలగించిన వ్యాఖ్యల తాలూకు వీడియోను ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్టు చేయడాన్ని తప్పుపడుతూ కాంగ్రెస్ ఎంపి చన్నీ లోక్‌సభ స్పీకర్‌కు ప్రధానిపై హక్కుల తీర్మానాన్ని ప్రవేశ పెట్టేందుకు అనుమతి కోరుతూ నోటీసును సమర్పించారు.



### యూపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా

## ప్రీతి సూదాన్

- నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా ప్రీతి సుదాన్ నియమితులయ్యారు. 2025, ఏప్రిల్ 29వ తేదీ వరకు లేకుంటే.. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆమె ఈ పదవిలో కొనసాగ నున్నారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఆమె కొనసాగుతున్నారు. ఆగస్ట్ 1వ తేదీన గురువారం ఆమె యూపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ఇప్పటి వరకు యూపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్న మనోజ్ సోని.. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన సంగతి తెలి సిందే. దీంతో కొత్త యూపీఎస్సీ ఛైర్మన్ నియామకం అనివార్యమైంది. ఇటీవల వరకు యూపీఎస్సీ ఛైర్మన్‌గా గుజరాత్‌కు చెందిన మనోజ్ సోని ఉన్నారు. 2029 ఏడాది చివర వరకు ఆయన ఆ పదవిలో కొనసాగవలసి ఉంది. కానీ వ్యక్తిగత కారణాలతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఆ కొద్దిరోజుల మిగతా.. 2లో

## రాజకీయ చర్చలతో
# దద్దరిల్లిన అసెంబ్లీ

- ఫిరాయింపులపై సబితతో ఫిర్యాదును ప్రస్తావించిన సీతక్క
- తనను టార్గెట్ చేస్తున్నారంటూ సబిత ఆగ్రహం
- సబిత మోసం చేసింది నిజమే అన్న సిఎం రేవత్
- కాంగ్రెస్‌ను మోసం చేసిన ఘనత మీదే అన్న భట్టి
- దళితుడు విపక్షనేత కాకుండా చేశారని ఆగ్రహం
- ద్రవ్యవినిమయ బిల్లుపై పక్కదారి పట్టిన చర్చ
- వ్యక్తిగత విమర్శలు..దూషణలకే పరిమితమైన నేతలు
- గత ప్రభుత్వం గొప్పలు చెప్పకునే ప్రయత్నం చేసిన కేటీఆర్
- కెటిఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు



**హైదరాబాద్,జూలై31(నమస్తే ఉదయం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో మాటల యుద్ధంతో ధ్దరిల్లింది. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో రాజకీయాలువె చోటు చేసుకున్నాయి. మొదట.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వర్సెస్ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులుగా సుమారు గంటకుపైగానే సభ నడవగా ఆ తర్వాత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రస్తావన వచ్చింది. సభలో పార్టీ మార్పులపై వాడి వేడిగా చర్చ నడుస్తుండగా పెద్ద రచ్చే అయ్యింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఇద్దరూ కౌంటర్ల వర్షం కురిపించారు.మంత్రి సీతక్క భారాసపై ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని భారాస నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు పత్రాన్ని కాంగ్రెస్‌లో గెలిచి భారాసలోకి వచ్చిన సబితా ఇంద్రారెడ్డితో ఇప్పించారని ఎద్దేవా చేశారు. భారాస వాళ్లు రాజీనామా చేయించి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారా అని ప్రశ్నించారు. ఈక్రమంలో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు తనను టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని.. ఓ అక్కగా మిగతా.. 2లో

## చీల్చి చెండాడుతానంటే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌తో వచ్చా

- కేటీఆర్ వంద పర్సెంట్ ఆర్టిఫీషియల్
- సున్నా పర్సెంట్ ఇంటిలిజెన్స్
- బతుకమ్మ చీరల పేరుతో సూరత్ చీరల్లో కమిషన్
- నిఖత్ జరీన్‌కు ఉద్యోగం అంటూ మోసం చేశారు
- సమగ్ర ప్రణాళికతో హైదరాబాద్ అభివృద్ధి
- స్కిల్ వర్సిటీ..స్పోర్ట్స్ వర్సిటీల ఏర్పాటు
- ముచ్చర్లను మరో నగరంగా అభివృద్ధి
- ఫార్మా విలేజీలను తీర్చిదిద్దుతాం
- అసెంబ్లీలో కెటిఆర్ వ్యాఖ్యలపై రేవంత్ ఘాటు సమాధానం



**హైదరాబాద్,జూలై31(నమస్తే ఉదయం):** తెలంగాణ అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై వాడీ వేడీ చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటలు తారాస్థాయికి చేరుకున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెటైర్లు కురిపించారు. అలాగే రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బడ్జె అన్ని వర్గాలను మోసం చేసిందని... అందరినీ వెన్నుపోటు పొడిచిందని.. ఈ ప్రభుత్వాన్ని చీల్చిచెండాడుతా అంటూ కేసీఆర్ మిగతా.. 2లో



## వయనాడ్ విపత్తులో 167కు చేరిన మృతులు

- కొనసాగుతున్న సమాయక చర్యలు
- ఆనవాళ్లు లేకుండా పోయిన పలు గ్రామాలు

**తిరువనంతపురం,జూలై31(నమస్తే ఉదయం):** వయనాడ్ ప్రకృతి విపత్తులో కొందరు సురక్షితంగా బయటపడి మంగళవారం వేకువజామున జరిగిన విధ్వంసాన్ని గుర్తు చేసుకొని వణికిపోతున్నారు. కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు 167 మంది చనిపోయినట్లు కేరళ వైద్యారోగ్య శాఖ తెలిపింది. మరో 91 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో గాయపడిన సుమారు 191 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వయనాడ్‌లో విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లా మెప్పడి, మండక్కై, చూరాల్‌మల, అట్టామల, నూల్‌పుజా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కొండ చరియలు విరిగిపడి గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. మరోవైపు ఈ గ్రామాల్లోని టీ, కాఫీ తోటల్లో పనిచేసే 600 మంది వలస కూలీల ఆచూకీ దొరకడం లేదని సమాచారం. సోమవారం అర్ధరాత్రి సమయంలో గ్రామస్థులంతా నిద్రలో ఉండగా ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో కొండ ప్రాంతం మిగతా.. 2లో

## అరచేతిలో స్వర్గం చూపేలా బడ్జెట్



- అనిశ్చితి నుంచి అభివృద్ధి దిశగా పదేళ్ల పాలన
- అప్పులే కాదు..సంపద సృష్టించి ఇచ్చాం
- కరోనాతో కొంత ఇబ్బంది పడ్డ మాట వాస్తవం
- బట్ట కాల్చి మీద వేసేలా కాంగ్రెస్ పాలన
- ద్రవ్య వినిమయ చర్చలో కెటిఆర్

**హైదరాబాద్,జూలై31(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో అరచేతిలో స్వర్గం చూపించింది.. బడ్జెట్‌లో మాత్రం మోచేతికి మిగతా.. 2లో

## ద్రవ్య వినిమయ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం



- సభలో గందరగోళం మధ్యనే బిల్లు పాస్
- అనంతరం సభను నేటికి వాయిదా వేసిన స్పీకర్

**హైదరాబాద్,జూలై31(నమస్తే ఉదయం):** తెలంగాణ అసెంబ్లీ ద్రవ్యవినిమియ బిల్లుకు ఆమోదం తెలిపింది. వాదాపవాదాలు, చర్చలు, ఉప చర్చల అనంతరం సభ బిల్లను ఆమోదించింది. తొలుత బిల్లను డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టగా, కెటిఆర్ దీనిపై చర్చ ప్రారంభించారు. తదనంతరం చర్చ పక్కదోవ పట్టి ఉపచర్చలకు దారితీసింది. ఓ దశలో సభలో గందరగోళం ఏర్పడింది. బిఆర్ఎస్ సభ్యులు మిగతా.. 2లో



## తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణం చేసిన జిష్ణుదేవ్ వర్మ

- ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

**హైదరాబాద్,(నమస్తే ఉదయం):** తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బుధవారం ప్రమాణం చేశారు.. రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు కార్యక్రమానికి హాజరయ్యారు.

అనంతరం కిషన్ రెడ్డి సహా మంత్రులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జిష్ణుదేవ్ వర్మ 2018 నుంచి 2023 వరకూ త్రిపుర రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పని చేశారు. గతంలో బాడ్మింటన్ మిగతా.. 2లో



## మహిళల భద్రత కోసం వివిధ పథకాలు అమలు

- రూ.13,412కోట్లు ఖర్చు చేస్తోందన్న కేంద్రమంత్రి బండి

**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** దేశంలో మహిళల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద కేంద్ర ప్రభుత్వం రూ.13,412కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ లోక్‌సభలో వెల్లడించారు. మహిళా భద్రతా పథకాల కింద మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను నిర్వహించే పరిశోధ కులతోపాటు ప్రాసిక్యూటర్ల సామర్థ్యం పెంపొందిం చేందుకు శిక్షణ ఇచ్చే నిబంధన ఉందా?, ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారంటూ ఎంపీ నీరజ్ శేఖర్ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ బదులిచ్చారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు హోంమంత్రి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దానికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి సభలో వెల్లడించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ మిగతా.. 2లో

## అధికారులు ఎవరైనా జైలుకు వెళ్లారా..?

**కోచింగ్ సెంటర్లలో ముగ్గురు దుర్మరణం కేసు**

**మున్సిపల్ అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం**

**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** రావూస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి చెందిన ఘటనలో మున్సిపల్ అధికారుల తీరుపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇప్పటివరకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఉచితాలకు ప్రాధాన్యం ఇస్తే ఇలాంటి పరిణామాలే ఎదుర్కోవాల్సి ఉంటుందని అభిప్రాయ పడింది. విద్యార్థుల మరణాలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు




చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తాజాగా విచారించింది. ఈ నేపథ్యంలో అధికారుల తీరును తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ.. పన్నులు వసూలుచేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు మిగతా.. 2లో



## వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌పై వేటు

- ఐఏఎస్‌ను రద్దు చేస్తూ యూపిపిఎస్సీ ఆదేశాలు
- ఎలాంటి పరీక్షలకు హాజరు కాకుండా నిషేధం

**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌పై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈమేరకు అధికారులు బుధవారం ఆదేవాలు ఇస్తూ వివరాలు వెల్లడించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ మిగతా.. 2లో

## జిఎస్టీ వాతలపై గళం విప్పిన గడ్కరీ


- జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్‌లపై 18శాతం జిఎస్టీయా?
- ఇది వ్యక్తి కష్టం, ఆరోగ్యాలపై పన్ను విధించడమే
- వెంటనే దృష్టి సారించాలంటూ నిర్మలా సీతారామన్‌కు లేఖ



**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** జిఎస్టీ వాతలపై ఇంతకాలం విపక్షాలు ప్రస్తావిస్తూ రాగా..తొలిసారిగా అధికార పక్షంలోనూ చర్చ మొదలయ్యింది. ఈ విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తొలిసారి పెదవి విప్పారు. ఇవేమి వాతలంటూ ఆర్థికమంత్రి దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు చెల్లిస్తున్న జీవిత, వైద్య బీమా ప్రీమియంలపై 18 శాతం వస్తు సేవల పన్ను జిఎస్టీని ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మిగతా.. 2లో

## తెలంగాణలో రైతు రుణమాఫీ

- హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో రాహుల్ పోస్ట్



**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** తెలంగాణలో ప్రస్తుతం రైతు రుణాల మాఫీ పండుగ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. తెలంగాణలో రైతుల పంట రుణాలను మాఫీ చేయడంపై రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు . ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తెలంగాణలో మరో ఎన్నికల హామీని నెరవేర్చామని పోస్ట్ చేశారు. 'తెలంగాణలో రైతులకు మళ్లీ మిగతా.. 2లో

# అరచేతిలో స్వర్గం చూపేలా బడ్జెట్

(మొదటిపేజీ తరువాత)

బెల్లం పెట్టిందని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నిప్పులు చెరిగారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. పదేండ్ల నాడు జూన్ 2014లో ఒక అనిశ్చిత పరిస్థితి ఉండేది. కానీ ఈ రోజు గర్వంగా చెప్పొచ్చు. సత్తువ ఇచ్చిన సోషియో ఎకానమిక్ అవుట్ లుక్‌లో తెలంగాణ గొప్ప రాష్ట్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. 2022 మార్చి 15న ఇదే సభలో ప్రతిపక్ష హోదాలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అయినప్పటికీ ప్రతి సంవత్సరం సంపద సృష్టిస్తున్నారు. రాష్ట్రాన్ని కరోనా అతలాకుతలం చేసినప్పటికీ ఆ దాడిని తట్టుకొని ఉత్పత్తి, సంపదను పెంచడం జరిగిందన్నారు. అక్కడ మార్పోగానే స్వరం మారింది. అయినప్పటికీ వారు ఇచ్చిన అవుట్ లుక్‌లోనే అన్ని విషయాలు వివరంగా చెప్పారు. ఇందులో వాస్తవాలు బయటపడ్డాయని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భారతదేశాన్ని సాదుతున్న రాష్ట్రాల్లో ఒకటి. ఉద్యమాలతో ఉదయించిన తెలంగాణ.. ఉజ్వల తెలంగాణగా ఎదుగుతుంది. ఇందులో రెండో మాట అవసరం లేదు. ఇప్పుడు ఎన్నికలు లేవు. నాలుగున్నరేండ్ల పాటు కలిసిమెలిసి పని చేసుకోవాలి. మాకు ప్రజలు అవకాశం ఇవ్వారు. డిసెంబర్ 3న చెప్పాం.. పదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటామన్నాం. ప్రతిపక్ష పార్టీగా ఈ రాష్ట్ర ప్రజల బాగు కోరుతూ మీరు తీసుకునే నిర్ణయాత్మక నిర్ణయాలకు సహకారం అందిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. మొన్న కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. శుష్క ప్రియాలు ..శూన్య హస్తాలు, గ్యారంటీలకు టాటా.. లంకె బిందెల వేట, డిక్లరేషన్లు డీలా.. డైవర్షన్ల మేళా.., హామీ పత్రాలకు పాతర.. శ్వేత పత్రాల జాతర, నిరుద్యోగుల మీద నిర్బంధాలు, జర్నలిస్టుల మీద దౌర్జన్యాలు, విమర్శిస్తే కేసులు..ప్రశ్నిస్తే దాడులు, నేతన్నల ఆత్మహత్యలు.. ఆటో అన్నల బలవన్మరణాలు, ఓట్లకు ముందు అభయ హస్తం.. ఓట్లు పడ్డాక శూన్య హస్తం, మేనిఫెస్టోలో అరచేతిలో స్వర్గం.. బడ్జెట్‌లో మాత్రం మోచేతికి బెల్లం, మూడు తిట్లు.. ఆరు అబద్ధాలతో పొద్దున లేస్తే బట్ట కాల్చి మీద వేసే పనులు ఇందులో కనబడుతున్నాయని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాల విషయంలో విమర్శ కోసం విమర్శ చేయొద్దు.. మీ ప్రభుత్వంలో కూడా కొన్ని డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఇప్పటికీ జీతాలు అందలేదని గుర్తు చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చురకలంటించారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌తో అప్పజెప్పితే అప్పులపాలు, అప్పులకుప్ప చేశారని కాంగ్రెస్ నేతలు అనడం సరికాదు. 2014లో రెవెన్యూ సర్ ప్లస్ రూ. 369 కోట్లు. 2022-23లో రెవెన్యూ సర్‌ప్లస్ రూ. 5,944 కోట్లతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పజెప్పాం. ఇది వాస్తవం కాదా..? మీరు ఇటీవల ప్రవేశపెట్టిన 2024 బడ్జెట్‌లో రెవెన్యూ సర్‌ప్లస్ 297 కోట్లు. తమకు రూ. 369 కోట్లతో అప్పజెప్పితే రూ. 5944 కోట్లతో అప్పజెప్పాం. ఇది తప్పా..? అప్పుల పాలైంది అని ఎలా అంటారు. జీతాలు ఇచ్చేందుకు అప్పులు తెస్తున్నామని ఆర్థిక మంత్రి అనడం సరికాదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కరోనా మహమ్మారిని విశ్వమానవాళి ఎదుర్కొంది. 2019 చివరలో కరోనా వచ్చింది. 2020 మార్చిలో హైదరాబాద్‌కు వచ్చింది. అప్పట్నుంచి రెండేండ్ల పాటు ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. అందుకే అప్పటిదాకా జీతాలు చక్కగా ఇచ్చాం. ఆ తర్వాత కొంత ఆలస్యం జరిగింది.

కరోనా వల్ల ఆర్థిక సంక్షోభం జరిగింది. కరోనా వల్ల ఆర్థిక నష్టం జరిగినప్పటికీ కళ్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్‌కు ఇచ్చే డబ్బులు ఆపొద్దని చెప్పి వాటికి ఇచ్చాం. ఉద్యోగులకు కొందరికి జీతాలు ఆలస్యంగా ఇచ్చి ఉండొచ్చు. నిన్న సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లకు 10 నెలలుగా జీతాల్లేవు అని చెప్పారు. విమర్శ కోసం విమర్శ చేయొద్దు. ఆలోచించండి అని కేటీఆర్ భట్టి విక్రమార్కకు సూచించారు. అప్పులు రెవెన్యూ రిసిట్స్‌కు లోబడి ఉన్నాయి. రెవెన్యూ సర్‌ప్లస్‌లో ఉన్నామంటే జీతాల కోసం అప్పులు చేసే పరిస్థితి లేదు. ఎస్‌ఓటీఆర్‌లో అంటే సొంత వనరుల్లో తెలంగాణ టాప్‌లో ఉంది. దయచేసి తప్పు ప్రచారం మానుకోండి. 6 లక్షల 71 వేల కోట్ల అప్పు ఉందని దుష్ప్రచారం చేయడం సరికాదు. అప్పుల విషయంలో హరీశ్‌రావు వివరంగా మాట్లాడారు. గ్యారంటీలు మాత్రమే ఇచ్చి వాటికి కట్టే అవసరం లేని వాటిని కూడా కలిపి బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలు అయిపోయాక కూడా ప్రతిపక్షంలో ఉండాల్సిన మోడ్‌లో ఉండకూడదు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నికర అప్పు కేవలం 3 లక్షల 85 వేల 340 కోట్లు మాత్రమే. సభను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకండి అని కేటీఆర్ సూచించారు. పదేండ్ల ప్రస్థానంలో తెలంగాణ తన సొంత కాళ్ల మీద నిటారుగా నిలబడ్డది. అనేక మంది శాపనార్థాలను తట్టుకొని, సవాళ్లను అధిగమించి ఇవాళ తెలంగాణ సిరిసంపదలతో భారతదేశ భాగ్యరేఖలను మార్చే రాష్ట్రంగా అగ్రభాగాన నిలబడిందని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఆర్బీఐ గణాంకాలు నిజాలను నిగ్గు తేలుస్తున్నాయి. సత్యాల మీద ముసుగులు వేయడం అంత సులభం కాదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. భారతదేశంలోనే తెలంగాణ 74 శాతం డెవలప్‌మెంట్ ఎక్స్‌పెండిచర్‌తో అగ్రభాగాన ఉన్నట్లు ఆర్బీఐ లెక్కలను సోషియో ఎకానమిక్ అవుట్ లుక్‌లో కోట్ చేశారు. ఈ విషయంలో మనం చాలా స్పష్టంగా ఇతర రాష్ట్రాలతో పోల్చితే మనం చాలా బెటర్‌గా ఉన్నాం. తెలంగాణలో రూపాయిలో కమిటెడ్ ఎక్స్‌పెండిచర్ 47 పోతే 53 పైసలు అదనంగా ఉన్నాయి. కేరళలో 82 పైసలు, హర్యానాలో 81 పైసలు, పంజాబ్‌లో 79 పైసలు, వెస్ట్ బెంగాల్‌లో 69, ఏపీలో 61, రాజస్థాన్‌లో 59 పైసలు కమిటెడ్ ఎక్స్‌పెండిచర్ కింద పోతున్నాయి. జాతీయ సగటు 56 పైసలు. కమిటెడ్ ఎక్స్‌పెండిచర్‌లో అత్యల్పంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ 4వ స్థానంలో ఉంది. తిమ్మినిబమ్మి చేయొద్దని సూచిస్తున్నా. పెద్దలు, జీతాల కోసం డబ్బులు సరిపోవట్లేదని వారు మాట్లాడడం సరికాదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## చీల్చి చెండాడుతానంటే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌తో వచ్చా

(మొదటిపేజీ తరువాత)

హెచ్చరించిన విషయం తెలిసిందే. దీనిపై సిఎం రేవంత్ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎన్నికలై పోయాయి, ప్రతిపక్షంగా మీ పాత్ర పోషించండి. కేసీఆర్ చీల్చి చెండాడుతా అంటే.. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకుని వచ్చా అంటూ సీఎం సెటైర్ విసిరారు. అలాగే... కేటీఆర్‌కు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లకు పోలిక ఉందని.. కేటీఆర్ వంద పర్సెంట్ ఆర్టిఫీషియల్, సున్నా పర్సెంట్ ఇంటిలిజెన్స్ అంటూ ఎద్దేవా చేశారు. కేటీఆర్‌కు ఓపిక, సహనం ఉండాలని సలహా ఇచ్చారు. కేటీఆర్‌కు అనుకోకుండా పదవి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. సభను తప్పుదోవ పట్టించటానికి కేటీఆర్‌కు ఇచ్చిన సమయాన్ని వినియోగించు కోవడానికి చూస్తున్నారని మండిపడ్డారు. సూచనల రూపంలో మోసాన్ని ప్రజల మెదళ్లలో కుక్కే ప్రయత్నం కేటీఆర్ చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల మీ పాలనలో మీ అనుభవాలు మీకు ఉన్నాయి.. ప్రజలకు అనుభవాలు ఉన్నాయి. మీ పాలన అనుభవాలతో ప్రజలు మాకు అధికారం ఇచ్చారు అని అన్నారు. పది నెలలు నిండని ప్రభుత్వంపై వందల ఆరోపణలు చేస్తున్నారన్నారు. బతుకమ్మ చీరలు సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేశారా? సూరత్ నుంచి తెచ్చారా? అని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల పథకంలో అవినీతి జరిగిందన్నారు. నేత కార్మికులకు పని కల్పించామంటూ అబద్దాలు చెప్పారని తెలిపారు. బతుకమ్మ చీరల డబ్బులు బకాయి పెడితే తాము చెల్లించామన్నారు. బతుకమ్మ చీరల కాంట్రాక్ట్ బినామీలకు అప్పగించారని.. సూరత్ నుంచి కిలోల చొప్పున చీరలు తెచ్చి కమీషన్ కొట్టేశారని ఆరోపించారు. ఎయిర్ పోర్టుకు ఎంఎంటీఎస్ సౌకర్యం కల్పిస్తామని కేంద్రం చెబితే వద్దని కేసీఆర్, కేటీఆర్ తిరస్కరించారన్నారు. ఎంఎంటీఎస్‌ను విమానాశ్రయం వరకు వేస్తామంటే అనుమతి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. దీనివెనుక ఆర్థిక కుట్ర ఏంటో అందరికి తెలియాలన్నారు. తామెప్పుడు పాతబస్తీని ఇస్తాంబుల్ చేస్తామని చెప్పలేదని... హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరినీళ్లలాగా మార్చుతామనలేదని అన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యునివర్సిటీ రేపు ప్రారంభిస్తామన్నారు. టూరిజం హబ్ క్రియేట్ చేస్తామంటున్నామని... ప్రపంచస్థాయి వైద్యం హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏషియన్ గేమ్స్ నిర్వహించిన హైదరాబాద్‌లో అన్ని స్టేడియంలు,ఆట స్థలాలు తాగుబోతులకు అడ్డాలుగా మారుతున్నాయన్నారు. ఒలింపిక్స్‌లో కాంస్యం వస్తేనే వందకోట్ల మంది సంబరపడే పరిస్థితి ఉందన్నారు. నిఖత్ జరీన్‌కు ఉద్యోగం ఇస్తామని చెప్పి గత బీఆర్ఎస్ సర్కార్ ఇవ్వలేదని మండిపడ్డారు. మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్1 ఉద్యోగం ఇస్తున్నామని తెలిపారు. ఫార్మాసిటీ అని వాళ్లన్నారని.. తాము ఫార్మా విలేజ్‌లు అంటున్నామని తెలిపారు. వేలఎకరాల్లో ఫార్మా కంపెనీలు పెడితే ఆ ప్రాంతమంతా కలుషితం అవుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వ్యవసాయానికి అనుసంధానం చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సికింద్రాబాద్, హైదారాబాద్, సైబరాబాద్‌లతో పాటు నాలుగవ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముచ్చర్లలో గొప్ప నగరం సృష్టిస్తున్నామని వెల్లడించారు. ముచ్చర్లలో నాలుగవ సిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మన భవిష్యత్ నగరంగా ముచ్చర్ల కాబోతుందన్నారు. మెట్రో సౌకర్యం కూడా కల్పిస్తాం పెట్టుబడులు ఎవరు పెట్టాలన్నా ముచ్చర్లకి రావాలని కోరారు. పది సంవత్సరాల్లో తెచ్చిన ఒక్క పాలసీ ఏమైనా ఉందా? అంటూ ప్రశ్నించారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీ, ఐటీ, ఎక్సైజ్ పాలసీలు తీసుకొస్తామని సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## అధికారులు ఎవరైనా జైలుకు వెళ్లారా..?

(మొదటిపేజీ తరువాత)

అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. బాటసారులపై పోలీసుల చర్యలు ఉంటాయి. కానీ, ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ) అధికారులపై లేవంటూ విమర్శించింది. పట్టణ నిర్వహణ ప్రణాళికపై అధికారులను ప్రశ్నించింది. మీరు ఈ కేసులో జూనియర్ అధికారులను అయితే తొలగించారు. కానీ, పర్యవేక్షించాల్సిన సీనియర్ అధికారుల సంగతేంటి? ఎంసీడీ నుంచి ఎవరైనా జైలుకు వెళ్లారా?' అని కోర్టు ప్రశ్నించింది. కోచింగ్ సెంటర్‌లో సంభవించిన ఈ మరణాలపై విచారణను కేంద్ర ఏజెన్సీకి బదిలీ చేయాలని సూచనప్రాయంగా పేర్కొంది. దీంతోపాటు రాజేందర్‌నగర్ ప్రాంతంలో డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. నగర ఎంసీడీ కమిషనర్, డీసీపీ, దర్యాప్తు అధికారి కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

## కవిత కస్టడీ 13 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ,జూలై31(నమస్తే ఉదయం):** ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జుడిషియల్ కస్టడీని ఆగస్టు 13 వరకు ఢిల్లీ కోర్టు పొడిగించింది. బిఆర్ఎస్ ఎంఎల్‌సి కె కవిత కస్టడీని కూడా ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఆగస్టు 13 వరకు పొడిగిస్తూ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఇదే కుంభకోణానికి సంబంధించి సిబిఐ నమోదు చేసిన అవినీతి కేసులో సిసోడియా, కవితల జుడిషియల్ కస్టడీని ఆగస్టు 9 వరకు కోర్టు పొడిగించింది. ఇదివరకు విధించిన జుడిషియల్ కస్టడీ గడువు ముగియడంతో నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

## వయనాడ్ విపత్తులో 167కు చేరిన మృతులు

(మొదటిపేజీ తరువాత)

విధ్వంసమైంది. ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. బురద మట్టిలో కూరుకుపోయిన గ్రామస్థులు ఆ మట్టిలోనే కలిసిపోయారు. తొలుత మండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగి పడ్డాయి. సమాచారమందుకున్న సహాయక సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. కొంత మంది బాధితులను సమీపంలోని చూరాల్‌మలలోని వెల్లారిమల పాఠశాలవద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి పంపించారు. మంగళవారం తెల్లవారు జామున 4.10 గంటలకు ఈ పాఠశాల సమీపంలో మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో శిబిరం సహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కూరుకుపోయాయి. అనేక వాహనాలు అందులో ఇరుక్కుపోయాయి. చూరాల్‌మల గ్రామంలోని కొంతభాగం తుడిచి పెట్టుకుపోయింది. మండక్కైలో మంగళవారం మధ్యాహ్నం మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలపై సుదర్శన్ అనే డ్రైవర్ తన అనుభవాలను వివరించారు. మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటలకు మెలకువ వచ్చింది. ఎప్పుడూ వినని నీటి ప్రవాహన శబ్దాలు వినిపించాయి. వెంటనే లేచాను. కరెంటు లేదు. చుట్టూ చీకటి అలుముకుంది. ఇన్వర్టర్ కూడా పని చేయడం లేదు. ఇంట్లో ఉన్న పరిస్థితి చూస్తే అది నీటిలో కొట్టుకు పోయిందని అర్థమైంది. ఇంటి బయట ఉండాల్సిన నా జీపు తలుపులు పగలగొట్టుకొని ఇంట్లోకి వచ్చేసింది. ఇంట్లో ఉన్న చాలా వస్తువులు పూర్తిగా నీట మునిగిపోయి ఉన్నాయి. రెండు అడుగులు కూడా వేయడానికి లేని పరిస్థితి ఉంది. ఏదోలా బయటకు వచ్చి చూస్తే మొత్తం మట్టి దిబ్బలే కనిపించాయని అన్నారు.

వాయనాడ్‌లోని చూరల్‌మలలో ఉంటున్న సుదర్శన్ డ్రైవర్‌గా వర్క్ చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల గురించి పొరుగు వారితో మాట్లాడుతూ ఏం జరుగుతుందో అని భయపడ్డారు. అనుకున్నట్టే ఆ రాత్రి భయానక వాతావరణం వాళ్లకు అనుభవంలోకి వచ్చింది. మొదట ముండక్కై పట్టణాన్ని కొండచరియలు ముంచేశాయి. తర్వాత చూరల్‌మల గ్రామాన్ని కమ్మేశాయి. సుదర్శన్ భయపడింది వాళ్ల అమ్మ భవానీ కోసం. ఆమె క్యాన్సర్ రోగి. తన ఇంట్లో మరికాసేపు ఉంటే కచ్చితంగా తామూ మునిగిపోతామని గ్రహించి సుదర్శన తన తల్లిని తీసుకొని అతి కష్టమ్మీద టెర్రస్‌పైకి వెళ్లాడు. 'ఆ క్షణంలో మా అమ్మను రక్షించుకోవాలనే ఆలోచన ఒక్కటే నా బుర్రలో తిరుగుతోంది. ఎక్కడి వెళ్లాలో కూడా తెలియలేదు. మేడపై నుంచి ఆ భయానక దృశ్యాలు చూస్తూ వణికిపోయారు సుదర్శన్, వాళ్ల అమ్మ. సాయం చేసేందుకు కూడా వాళ్లకు ఎవరూ కనిపించలేదు. సాయం కోసం ఎదురు చూడటం.. వరద వస్తే కొట్టుకుపోవడంతో తప్ప వేరే దారి వాళ్లకు లేదు. 'చూరల్‌మల నది మా ఇంటి వెనుక 400 మీటర్ల దూరంలో ప్రవహిస్తుంది. మా ఇంటి చుట్టూ నదీ ప్రవాహమే కనిపించింద. ఇరుగు పొరుగు ఇళ్లు నీటిలో కొట్టుకు పోతున్నాయి. అప్పుడు మా అమ్మతో ఒకటే చెప్పాను. 'ఈ ప్రపంచంలో మనకు నూకలు చెల్లాయని... తర్వాత మన ఇల్లే కొట్టుకుపోవచ్చని అన్నాను.'అని సుదర్శన గుర్తు చేసుకున్నాడు. చుట్టుపక్కల ఇళ్లు కొట్టుకుపోతున్నా.. సుదర్శన ఇల్లు మాత్రం ప్రకృతి విధ్వంసాన్ని తట్టుకొని నిలబడింది.

మొత్తం మూడుసార్లు కొండచరియలు విరిగిపడినా వాళ్లు సురక్షితంగా బయటపడ్డారు. వారికి సమీపంలో ఉంటే ఓ కుటుంబంలోని 11 మంది సభ్యులు కనిపించకుండా పోయారు. తను ప్రమాదంలో ఉంటున్న సుదర్శన కొందరిని రక్షించగలిగాడు. సాయం చేయాలని కేకలు వేసిన వారి ఇంటిపైకి నిచ్చెనతో వెళ్లి వారిని తన ఇంటి డాబాపైకి తీసుకొచ్చాడు. ఇలా 20 మందిని రక్షించాడు. సుదర్శన ఇంటితోపాటు జీవనోపాధి అయిన జీపు కూడా పోయింది. ఇప్పుడు లైఫ్‌ను మొదటి నుంచి స్టార్ట్ చేయాలని సుదర్శన్ అంటున్నాడు.

## ద్రవ్య వినిమయ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

(మొదటిపేజీ తరువాత)

వెల్‌లో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సభ ఆర్డర్‌లో తేవడానికి స్పీకర్ చేసిన యత్నాలు ఫలించలేదు. ఈ క్రమంలో భట్టి బిల్లను ఆమోదించాల్సిందిగా కోరాగా సభ ఆమోదించిన తరవాత శాసనసభ గురువారం నాటికి వాయిదా పడింది. ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపిన అనంతరం గురువారం ఉదయం 10 గంటలకు తిరిగి సమావేశం అయ్యేందుకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. బుధవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగా, ద్రవ్య వినిమయ బిల్లుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చర్చ ప్రారంభించారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను మరోసారి గుర్తు చేస్తూ, ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ఎత్తిచూపుతూ కేటీఆర్ ప్రసంగం కొనసాగింది. ఇక కేటీఆర్ ప్రసంగానికి అధికార పార్టీకి చెందిన సభ్యులు పలువురు ఘాటుగా సమాదానం ఇచ్చారు. ఇక సభలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. తనను ఎందుకు టాగెంట్ చేస్తున్నారంటూ సబిత సీఎం రేవంత్‌ను నిలదీశారు. ఇక సీఎం మాటలకు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు కూడా వంతపాడారు. గందరగోళ పరిస్థితుల నడుమ సభను పది నిమిషాల పాటు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మళ్లీ తిరిగి సభ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ప్రారంభమైంది. సబితా ఇంద్రారెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టు పట్టారు.

స్పీకర్ వినిపించుకోకుండా అధికార సభ్యుడు గడ్డం వివేక్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియంలోకి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. సబితకు మైక్ ఇచ్చేందుకు సుముఖంగా లేని ప్రభుత్వం.. చివరకు బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించుకుంది. అనంతరం సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## రాజకీయ చర్చలతో దద్దరిల్లిన అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాత)

కాంగ్రెస్‌లోకి సంతోషంగా ఆహ్వానించినట్లు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డికి నాపై ఎందుకు కక్ష?. ఆరోజు పార్టీలోకి వచ్చినప్పుడు కాంగ్రెస్ ఆశాకిరణం అవుతావని చెప్పాను. సీఎం అవుతావని కూడా చెప్పాను. మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను అని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సబితక్క నన్ను పార్టీలోకి ఆహ్వానించిన మాట వాస్తవం. వ్యక్తిగతంగా జరిగిన సంభాషణ సభలో చెప్పారు. సబిత సభలో ప్రస్తావించారు కాబట్టే.. అప్పుడు జరిగిన పరిణామాలు సభలో చెప్పాలి. 2019లో మల్కాజిగిరిలో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే అండగా ఉంటానని సబితక్క మాట ఇచ్చారు. కాంగ్రెస్ నన్ను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఆమె భారాసలో చేరారు. అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి భారాసలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. తమ్ముడిగా నన్ను మోసం చేశారు కాబట్టే ఆమెను నమ్మవద్దని కేటీఆర్‌కు చెప్పా. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే గెలిపించే బాధ్యత నాదే అని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. నేను చెప్పింది నిజమో.. కాదో.. సబితక్క గుండె మీద చేయి వేసుకుని చెప్పాలని రేవంత్ చెప్పారు. ఈ క్రమంలో కేటీఆర్ వెనకాల ఉన్న అక్కల మాట వినొద్దని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. వెల్ లోకి దూసుకొచ్చి ఆందోళన చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి వచ్చారని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిని తమ్ముడిగా పార్టీలోకి ఆహ్వానించానన్నారు. సీఎం రేవంత్ పదే పదే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే స్పీకర్ కలుగజేసుకుని సభా నాయకుడిని అగౌరవ పరుస్తున్నారని సబితకు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సబితా అనుభవించిన పదవులు మొత్తం అన్నీ ప్రస్తావించారు. '2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ సబితా ఇంద్రారెడ్డికి అనేక పదవులు ఇచ్చింది. కానీ.. సబితా ఇంద్రారెడ్డి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరి మోసం చేశారు. ఒక దశాబ్ద కాలం సబితకి మంత్రి పదవి ఇచ్చాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుంటే సబిత బీఆర్ఎస్‌లోకి వెళ్ళారు. కాంగ్రెస్ నన్ను సీఎల్పీ లీడర్ చేస్తే నా వెనక ఉండాల్సింది పోయి పదవి కోసం సబిత పార్టీ మారారు.

## జిఎస్టీ వాతలపై గళం విప్పిన గడ్కరీ

(మొదటిపేజీ తరువాత)

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాశారు. లైఫ్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 18 శాతం జీఎస్‌టీని తగ్గించాలని ఆ లేఖలో కోరారు. ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై పన్ను విధించడం అంటే.. ఒక వ్యక్తి కష్టం, అనారోగ్యం పై పన్ను విధించినట్లేనని తెలిపారు. అదే విధంగా వైద్య బీమా ప్రీమియం రంగంపై 18 శాతం జీఎస్‌టీ తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందన్నారు. జీవిత, వైద్య బీమా ప్రీమియంపై జీఎస్టీ చెల్లించడం సీనియర్ సిటిజన్లకు పెద్ద సవాలుతో కూడుకున్నదని తెలిపారు. ఈ అంశంపై పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై నాగపూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ తనకు మెమోరాండం సమర్పించిందని లేఖలో పేర్కొన్నారు. కాగా... ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని పునఃపరిశీలించాలని నిర్మలా సీతారామన్‌కు గతంలో పలు మార్లు అభ్యర్థనలు వచ్చాయి. వ్యక్తిగత ఆరోగ్య పాలసీలపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని ఈ ఏడాది జూన్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సామాజిక భద్రతకు కొలమానంగా ఈ పాలసీలను కొనుగోలు చేసేలా ప్రజలను ప్రోత్సహించడంలో మీరు చేసే తగ్గింపు సహాయపడుతుందని నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంఘం తెలిపింది. పెరిగిన పన్నుల రీత్యా గత 5 సంవత్సరాలలో ఆరోగ్య బీమా ప్రీమియం దాదాపు రెండింతలు పెరిగిందని.. దీంతో పాలసీలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. కొంతమంది ఆరోగ్య బీమా పాలసీలు తీసుకున్నా మళ్లీ రెన్యువల్ చేసుకోవడం లేదని.. రెన్యువల్ చేసుకున్న వారు 65 నుంచి 75 శాతం వరకే ఉంటుందని పేర్కొంది. బీమా ప్రీమియంలను తరచుగా పెంచడం, ఎక్కువ జీఎస్‌టీ రేటు కారణంగా చాలా మంది పాలసీదారులు ప్రీమియం చెల్లించలేకపోతున్నారని సంఘం పేర్కొంది.

## తెలంగాణలో రైతు రుణమాఫీ

(మొదటిపేజీ తరువాత)

శుభాకాంక్షలు. మన ఎన్నికల హామీ ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రుణమాఫీ రెండవ విడతను విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. రాష్ట్రంలోని 6.4 లక్షల రైతు కుటుంబాలకు రూ. 1.5 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేసి వారిని ఆదుకుంది. ఒక వైపు బీజేపీ దేశవ్యాప్తంగా రైతులను అప్పుల ఊబిలో కూరుకునేలా చేయడమే కాకుండా ఎంఎస్‌పీకి చట్టబద్ధత కూడా కల్పించడం లేదు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రతి సందర్భంలోనూ రైతు కుటుంబాలకు సహాయం అందించడానికి కృషి చేస్తుంది. ఎఔఆఎం కూటమి భారత దేశ రైతులకు ఓ-ూఖ పైన చట్టపరమైన హామీ ఇచ్చి, రుణ విముక్తులను చేస్తుందని ఎక్స్‌లో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా రైతు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీకి కట్టుబడి.. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ పక్రియను ప్రారంభించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా రూ. 2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తామని అన్నారు. అన్నట్లుగానే తొలి విడత రుణమాఫీ పక్రియను జులై 18న ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. తొలి విడతలో రూ. 1 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేశారు. అర్హులైన 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,098 కోట్లు జమ చేశారు. రెండో విడతలో భాగంగా 6,40,223 మంది రైతులకు రూ. 6190.01 కోట్లు విడుదల చేశారు. మొత్తం రెండు విడతల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 17.75 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 12,224 కోట్లు జమ చేసి రైతు రుణాలు మాఫీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఆగష్టు 15వ తేదీ నాటికి రూ. 2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

## వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై వేటు

(మొదటిపేజీ తరువాత)

వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ ఖేద్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే, దీనికి ఆమె నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించాం. కానీ, ఆమె ఆగస్టు 4 వరకు గడువు కావాలని కోరింది. ఇందుకు తిరస్కరించి.. జులై 30 వరకు అదనపు సమయం కల్పించాం. ఇదే చివరి అవకాశమని.. ఎలాంటి పొడిగింపులు ఉండవని స్పష్టంచేశాం. కానీ, ఆమె గడువులోగా తమ సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2022లో ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నాం. భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే నియామక పరీక్షలు/ఎంపికలకు హాజరుకాకుండా శాశ్వతంగా డిబార్ చేస్తున్నాం అని యూపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది. యూపీఎస్సీ పరీక్ష నిబంధనల్ని అతిక్రమిస్తూ అవకాశాలు వాడుకొని ఆమె నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించామని గతంలో కమిషన్ పేర్కొంది. తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్/సంతకం, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడ్డారని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆమె ప్రొబేషన్‌ను నిలిపివేసి.. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించగా ఆమె అక్కడికి వెళ్లలేదు. మరోవైపు, చీటింగ్-ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ నిమిత్తం ఆమె ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఆగస్టు 1వ తేదీన న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

## మహిళల భద్రత కోసం వివిధ పథకాలు అమలు

(మొదటిపేజీ తరువాత)

కోసం రూ.3,375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్‌కు రూ.280 కోట్లు, జైళ్ల ఆధునీకరణకు రూ.950 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్రాల సైన్స్ ఫోరెన్సిక్ లాబరేటరీల పటిష్టత కోసం రూ.106.75కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీల ఆధునికీకరణకు మరో రూ.354.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. లాగే సేఫ్ సిటీ ప్రాజెక్టు కోసం రూ.2,840కోట్లు, మహిళలకు శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5కోట్లు, పేద ఖైదీల కోసం రూ.60కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్) యూనిట్ కోసం రూ.113.76కోట్లు, మహిళా హెల్ప్ డెస్కులకు రూ.164.2 కోట్లు, చంఢీగడ్‌లో డీఎన్ఏ ల్యాబ్ ఏర్పాటుకు రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణకు రూ.224.76కోట్లు, సెంట్రల్ విక్టిమ్ కాంపోజిషన్ ఫండ్ కోసం రూ.200కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ పోలీస్ స్కీమ్ ఫర్ ప్రొవైడింగ్ ఫెసిలిటీ ఆఫ్ సోషల్ వర్కర్స్ , కౌన్సిలర్స్, న్యూ బిల్డింగ్ ఫర్ విమెన్ సెంట్రిక్ ఫెసిలిటీస్, స్పెషల్ నీడ్స్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కోసం రూ.38.8కోట్లు, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ పథకానికి రూ.2254కోట్లు, మొత్తంగా రూ.13,412కోట్లు మన అమ్మలు, అక్కలు, చెలలెళ్లు, బిడ్డల కోసం కేంద్రం ఖర్చు పెడుతున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వివరించారు.

## యూపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా ప్రీతి సూదాన్

(మొదటిపేజీ తరువాత)

ముందే.. మహారాష్ట్రలోని పుణె ట్రైయినీ కలెక్టర్ పూజా ఖేద్కర్ వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. దానితోపాటు ఆమె దివ్యాంగుల కోటాలో ఐఏఎస్ పదవికి ఎంపికయ్యారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. సరిగ్గా అలాంటి వేళ యూపీఎస్సీ చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేశారు. దీంతో ఆయన రాజీనామా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే పూజా ఖేద్కర్ అంశానికి మనోజ్ సోని రాజీనామాకు ఎటువంటి సంబంధం లేదని ఇప్పటికే కేంద్రం స్పష్టత ఇచ్చింది. అదీకాక మనోజ్ సోని.. ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడనే ఓ ప్రచారం సైతం సాగుతుంది. 1983, బ్యాచ్ ఐఏఎస్ అధికారి.. ప్రీతి సుదాన్. ఇక ప్రీతి సుదాన్ భర్త రణదీప్ సుదాన్ సైతం ఐఏఎస్ అధికారే. వీరిద్దరు ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్‌లు. ఉమ్మడి ఏపీలోని వివిధ జిల్లాలకు వీరిద్దరు కలెక్టర్లుగా పని చేసిన విషయం విదితమే.

## తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణం చేసిన జిష్ణుదేవ్ వర్మ

(మొదటిపేజీ తరువాత)

అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా సేవలందించారు. ఈయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వారు కాగా.. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో, 1990లో బీజేపీలో చేరారు. ఆయన అప్పటి నుంచి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు.

త్రిపుర ప్రభుత్వంలో ఆయన మంత్రిగా విద్యుత్, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్, ఆర్థిక, ప్రణాళిక, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖల బాధ్యతలను నిర్వర్తించారు.



హబీబ్ ఖాన్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామి రెడ్డి, తదితరులు

## డ్రైవర్ హబీబ్ ఖాన్‌ను ఘనంగా సన్మానించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు

**రాజేంద్రనగర్, జూలై31(నమస్తే ఉదయం):**
ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో పరిపూర్ణంగా తన విధులు నిర్వహిస్తూ సంస్థ పురోగతికి తోడ్పడాలనీ, అదే సమయంలో ఇతరులతో సత్సంబంధాలు నెలకొల్పుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి సూచించారు. ఉద్యోగుల సమిష్టి కృషితోనే సంస్థలు, వ్యవస్థల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఆయనన్నారు. విశ్వ విద్యాలయంలో డ్రైవర్ గా 34 ఏళ్ల పాటు విధులు నిర్వహించిన హబిబ్ ఖాన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఈరోజు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగింది. హబిబ్ ఖాన్ ని రిజిస్ట్రార్ ఘనంగా సన్మానించారు. ఆయన భవిష్యత్ జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. పలువురు ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు.

### బాలికపై అత్యాచారం,హత్య కేసులో
## ముద్దాయికి ఉరిశిక్ష

**హైదరాబాద్,జులై 31(నమస్తే ఉదయం):**
తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. బాలికపై అత్యాచారం,హత్య కేసులో ముద్దాయికి ఉరిశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది.







2018లో నార్సింగిలో నాలుగున్నరేళ్ల బాలికపై దినేష్ తాపీ కార్మికుడు అత్యాచారం చేసి,ఆపై హత్య చేశాడు.ఈ కేసులో 2021లోనే రంగారెడ్డి కోర్టు దోషికి ఉరిశిక్ష విధించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించాడు. బుధవారం ఆ పిటిషన్‌పై విచారణ జరగ్గా రంగారెడ్డి కోర్టు తీర్పును రాష్ట్ర హైకోర్టు సమర్థించింది.కాగా బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన యువకుడు సెంట్రింగ్ పనిచేసే కార్మికుడిగా పోలీసులు గుర్తించారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారినీ సత్కరించిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(నమస్తే ఉదయం):**
పోలీస్ శాఖలో వివిధ పోలీస్ స్టేషన్ లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌గా 34 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించి బుధవారం పదవీ విరమణ చేసిన పి.విజయ్ భాస్కర్ రెడ్డి (గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్)ని జిల్లా పోలీస్ కార్యాలయం లోని



సమావేశ హల్ నందు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబాన్ని, వృత్తిని బ్యాలెన్స్ చేసుకుంటూ క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ సేవలు అందించడం గొప్ప విషయం అని, అందుకు ఆయన వెనుకుండి నడిపించిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో తప్పని సరి అని, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారిని కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు.

పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన జీపీఫ్ , ఇన్స్యూరెన్స్, భద్రత సాంక్షన్ బిల్స్ అందజేశారు. ఇంక రావాల్సిన బెనిఫిట్స్ ను కూడ త్వరగా అందేలా చూడాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో గద్వాల్ రూరల్ ఎస్సై పర్వతాలు, సూపరింటెండ్స్ నాగేందర్, నయీం, హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శివతత్వ భువన సారం ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ

**రాజేంద్రనగర్, జూలై31(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్‌కు చెందిన కవి, రచయిత, గాయకుడు మన్నె మహాత్మా రావు ముదిరాజ్ రచించిన శివ తత్వ భువన సారం అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఇటీవల భవానీ కాలనీ శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామీ దేవాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవానీ కాలనీ, రాజేంద్రనగర్ , కిస్మత్పూర్ ప్రాంతాలకు చెందిన పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉద్యోగం చేసిన మహాత్మారావు చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక జీవనం అంటే ఇష్టపడేవారు. ఆయన శ్రీ రాఘవేంద్ర స్వామి, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకాల ప్రదర్శనతో పాటు అనేక భజన, భక్తి గీతాలు స్వయంగా రచించి ఆలపించారు. మొదటినుంచి ఆధ్యాత్మిక భావాలు కలిగిన మహాత్మా రావు ఇటీవల కాలంలో అనేక ఆధ్యాత్మిక పుస్తకాలను రచించి ప్రజలకు అంకితం చేశారు.



మహాత్మా రావును సన్మానిస్తున్న ప్రజలు

# అట్టడుగున ఉన్న మత్స్యకారులను ఆదుకోవడమే సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశం...

### తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్...

**బిఆర్ఎస్ అక్రమాలను వెలికి తీసి విచారణ జరిపించి కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన కార్యకర్తలకు ఉపాధి అవకాశం కల్పించాలి: టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం**

**కూకట్‌పల్లి, జూలై 31 (నమస్తే ఉదయం):**
తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులను ఆదుకోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశమని తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్ బి కాలనీ పోస్ట్ ఆఫీస్ క్వార్టర్స్ పక్కన చైతన్య ఫుడ్ కోర్ట్ సమీపంలోని ఫిష్ మార్కెట్ ను తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, డిస్ట్రిక్ట్ ఫిషరీస్ ఆఫీసర్ పూర్ణిమ సింగ్, డిస్ట్రిక్ట్ ఫిషెర్మెన్ చైర్మన్ మన్నెరాజు, వైస్ చైర్మన్ కాపర్తి కృష్ణ మోహన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషర్మెన్ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్ లు సందర్శించారు. ఈ సందర్భంగా మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బంది ఉన్నటువంటి ప్రతీ మత్స్యకారున్ని ఆదుకునే విషయంలో కూకట్ పల్లి ఫిష్ మార్కెట్ ను సందర్శించానని, గత ప్రభుత్వంలో చేసినటువంటి ఏ అక్రమాలని వదలం అని అన్నారు. చాలామంది సభ్యులు కానీ వాళ్ళు వ్యాపారం చేసుకుంటున్నారని, ఎవ్వరైనా కూడా నిజమైన మత్స్యకారులను ఇబ్బంది పెట్టి వారి ఆర్థిక పురోగతిని ఇబ్బంది పెడితే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ మార్కెట్ లో వచ్చే నెలలో సొసైటీ లో సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్క సభ్యుడు ఇక్కడ చేపలు అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోబోతున్నాం అన్నారు. ఎవరైనా సభ్యులుగా లేని ఎంత పెద్ద నాయకుల అండ ఉన్న వారైనా సరే ఇక్కడ చేపలు అమ్మనియ్యమని తెలిపారు. ఆన్లైన్ విధానాన్ని ఏర్పాటు చేసి తద్వారా వారికి సభ్యత్వ కార్డు ఇస్తామని, సభ్యత్వం ఉన్న వాళ్ళకి మాత్రమే ఇందులో స్థానం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఫిష్ మార్కెట్ ను సందర్శించాక



ఒకరి పేరు మీద దుకాణం వస్తే ఇంకొకరు అద్దెకు ఇచ్చుకొని మత్స్యకారులకు అన్యాయం చేస్తున్నారని, ఇంకా బిఆర్ఎస్ నాయకుల జులూమ్ ఈ మార్కెట్ లో కనబడుతుందన్నారు. చైర్మన్ అవకాశం తీసుకొని నిష్పక్షపాతంగా విచారణ జరిపించి అన్యాయంగా దుకాణాల్లో ఉండి లబ్ది పొందుతున్న వాళ్ళని, డబ్బులు వసూలు చేస్తున్న వాళ్ళని ఈ సొసైటీ నుండి తీసేసి కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు సొసైటీ సభ్యత్వం కల్పించి ఉపాధి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్ పుత్, సంజీవ్, అరవింద్ రెడ్డి, గంధం రాజు, ఫణి కుమార్, అప్పారావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హరీష్, శ్రవణ్, ప్రకాష్ ముదిరాజ్, అనిల్, మహేందర్, శేఖర్ గజానంద్, శివ చౌదరి, పవన్, అంజి, మహిళా డివిజన్ అధ్యక్షులు రజిత, మారుతీ, సంధ్య, రేష్మ, అరవింద మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 31(నమస్తే ఉదయం):**
మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పాము అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 10 వేల రూపాయలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది. కాగ్రేస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హమీఇచ్చారు. దాన్ని అమలు చేయాలి. రాష్ట్రంలో మధ్యాహ్న భోజనాన్ని హరే కృష్ణ హరే రామకు కొడంగల్ నియోజకవర్గం లో పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించడం జరిగింది.

ఇలాంటి నిర్ణయంతో కార్మికుల పొట్ట కోటడానికే అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాలను అక్షయపాత్రకు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణ యాన్ని వెనక్కి తీసుకోవాలి. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈరోజు అని సమస్యల మీద చలో అసెంబ్లీ నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి



వనంపల్లి జైపాల్ రెడ్డి, కార్మికులను అక్రమంగా అరెస్టు చేసి చంద్రాయన్ గుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టిన కార్మిక సమస్యలు పరిష్కారం చేసేంతవరకు



ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఈ ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామని అన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు

**కాంగ్రెస్ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి**

**రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం**

**మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలి**

**కొత్తకోట, జూలై 31(నమస్తే ఉదయం):**
బ్యాంకు మేనేజర్లు రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని, రుణమాఫీ అయిన రైతులు అందరికీ కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్త కోటలో వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమై రైతులతో కలిసి ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...దేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతుల జీవితాలలో వెలుగులు నింపారన్నారు.
రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇచ్చి బ్యాంకర్ల రైతులకు అండగా నిలవాలని కోరారు.
బ్యాంకులలో రుణాలు మాఫీ అయిన రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని ప్రతినిత్యం ఆరోపణలు వినిపిస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు.
అన్నం పెట్టే రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది



లేదన్నారు. రుణాలు మాఫీ రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. కొన్ని సంకేతిక కారణాలవల్ల రుణాల మాఫీ విషయంలో కొద్దిగా ఆలస్యం జరుగుతుందని బ్యాంక్ అధికారులు వివరించారు. పదేళ్లు పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం హంగు ఆర్భాటాలకు పోయింది తప్పా చేసింది ఏం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేస్తుండడం పట్ల ప్రభుత్వానికి వ్యవసాయం రంగం బలోపితం కోసం సీఎం కృషి చేస్తున్నాడన్నారు.
దేశ చరిత్రలోనే వ్యవసాయ రంగానికి బడ్జెట్లో రూ 72 వేల కోట్లు కేటాయించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.
తెలంగాణ రాష్ట్రంలో రైతులందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి కి రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి, దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి కి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి పి మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రైతులు నారాయణరెడ్డి, బీసం పద్మనాభ రెడ్డి, తోళ్ల బలరాం నాయిడు, హేమ సుందర్ రెడ్డి, గట్టు యాదవ్, ముంత బాల స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(నమస్తే ఉదయం):**
అర్హులైన ప్రతి లబ్ధిదారునికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మొదటి వార్డు నుండి డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు పక్క ఇల్లు అందించాలని ఉద్దేశంతో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేవలం కేటాయింపులతోనే సరి పుచ్చారని వారికి పంపిణీ చేయకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు ఇల్లు లేని పేదలు, వితంతువులు, వికలాంగులు, వృద్ధులు అద్దె నివాసాలలో శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో కొనసాగుతూ జీవనం కొనసాగిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించకపోవడం వల్ల విలువైన ప్రజాధనం సమయం వృథా అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రెండు పడకల గదులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని దీని వల్ల ఎవరికి మేలు జరుగుతున్నదని నిలదీశారు.



ఇప్పటికే కొన్ని చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని మరి కొన్ని చోట్ల కిటికీలు తలుపులను ధ్వంసం చేశారని ఇంకా నిర్లక్ష్యం చేస్తే, మరింత శిథిలావస్థకు చేరి లబ్ధిదారులకు అందజేసిన ఇంటి మరమ్మతులకే పెద్ద మొత్తంలో ఖర్చు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని జిల్లా అధికార యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి అర్హులైన ప్రతి లబ్ధి దారునికి వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేపట్టాలని లేని పక్షంలో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చలో కలెక్టర్ కార్యక్రమానికి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆది, మహేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామి రెడ్డి

## వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటిన అధికారులు

**రాజేంద్రనగర్, జూలై31(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం వన మహోత్సవం - 2024 ఉత్సాహభరితంగా జరిగింది. రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి ఇతర విశ్వవిద్యాలయ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ, ప్రకృతి పరిరక్షణకి మొక్కలు విరివిగా నాటాలని ఆయన సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకోవడానికి మొక్కల పెంపకాన్ని ఉద్యమస్ఫూర్తితో చేపట్టాల్సిన అవసరం ఉందని రఘురామిరెడ్డి అభిప్రాయపడ్డారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా మొక్కలు నాటారు. ఈ వన మహోత్సవంలో వేప, రావి, ప్లుమేరియం వంటి సుమారు 150 మొక్కలు నాటారు.

## మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**- బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం వనితా రెడ్డి**

**రాజేంద్రనగర్, జూలై 31(నమస్తే ఉదయం):** హామీలు నెరవేర్చలేని సీఎం రేవంత్ రెడ్డి గద్దె దిగాలని,తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని భారతీయ జనతా మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం వనితా రెడ్డి, అధ్యక్షురాలు ఉమ హల్లాలే అన్నారు. బుధవారం మహిళా మోర్చా డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా దీక్షను భగ్నం చేసేందుకు బిజెపి మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం



బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి
ఎం.వనిత రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన ఎస్ఐ మౌనిక

వనిత రెడ్డి ని సబ్ ఇన్స్పెక్టర్ మౌనిక రెడ్డి హౌస్ హౌస్ అరెస్ట్ చేశారు. అత్తాపూర్ డివిజన్ మహిళా మోర్చా కార్యకర్తలను పోలీసులు అత్తాపూర్ ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతీ మహిళకు నెలకు రూ.2500 అకౌంట్లో వేస్తామని నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని,రూ.500 లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇవే కాకుండా మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తామని నమ్మబలికిన సీఎం రేవంత్ రెడ్డి మహిళలను గౌరవించకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని రాష్ట్ర మహిళలందరికి మొండిచేయి చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్ర బడ్జెట్ లో మహిళలకు బడ్జెట్ కేటాయించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు.బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన మహిళా మోర్చా నాయకులను ఏకాదశి పండుగనాడు కనీసం పూజ చేసుకొనివ్వకుండా ఇళ్లలోంచి లాక్కెళ్లడంపై పోలీసుల జులుంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేని సీఎం గద్దెదిగాలని ఆమె డిమాండ్ చేశారు.

## చీటింగ్ కేసులో జిహెచ్ఎంసి ఉద్యోగుల అరెస్టు

**రాజేంద్రనగర్,జులై 31 (నమస్తే ఉదయం):** నకిలీ పత్రాలు సృష్టించిన నిందితులకు సహకరించిన జిహెచ్ఎంసి ఉద్యోగులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం...ఉప్పర్ పల్లి గ్రామంలోని 43, 44, 46 సర్వే నెంబర్లలో ముక్రముద్దీన్,అస్ఫాక్,ముక్తదిర్ లు నకిలీ పత్రాలు సృష్టించి రోడ్డు విస్తరణలో తమ స్థలం పోతోందని తెలుపుతూ టీడీఆర్ ను అప్లై చేశారు.పై ముగ్గురికి అనుకూలంగా రాజేంద్రనగర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం సెక్షన్ అధికారి కబీరుల్లా ఖాన్, డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణమోహన్,ల్యాండ్ ఆక్వేషన్ సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డి, భూసేకరణ సర్వేయర్ దీపక్ కుమార్‌లు నిందితులకు అనుకూలంగా ఫైల్ ను ప్రాసెస్ చేశారు.ముక్రంకు అనుకూలంగా ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ సర్టిఫికెట్ ను అందజేశారు. టీడిఆర్‌ను రూ.5.78 కోట్లకు ఓ బిల్డర్‌కు విక్రయించారు.అనంతరం నిందితులతో కలిసి జిహెచ్ఎంసి అధికారులు పంచుకున్నారు.

నకిలీ పత్రాలకు టిడిఆర్‌ను అందజేసి జిహెచ్ఎంసి ఖజానాకు గండి కొట్టిన అధికారులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## నేడు ఈదమ్మ, భులక్ష్మమ్మ దేవాలయం వద్ద అన్న దానం



**రాజేంద్రనగర్, జూలై31(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డీ చౌరస్తాలో గల ఈదమ్మ, భూ లక్ష్మమ్మ అమ్మవార్ల దేవాలయం వద్ద ఆగస్టు 1వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటలకు మహా అన్నదాన కార్యక్రమం (ఓడి బియ్యం) నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం బోనాల పండుగ అనంతరం ఈదమ్మ, భూ లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో ఓడి బియ్యం వండి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన ప్రజలతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



### పదవి విరమణ చేసిన ఎస్.పి.సి. శ్రీనివాస రావును సన్మానించిన

# యువనాయకులు బండ్ల సాయి సాకేత్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31 (నమస్తే ఉదయం):** గద్వాల పీజేపీ సర్కిల్ పర్యవేక్షణ ఇంజి నీరు నీటిపారుదల శాఖ అధికారి ఎస్.పి.సి శ్రీనివాస రావు పదవీ విరమణ సన్మాన మహోత్సవం వేడుకలు బుధవారం గద్వాల పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ మహోత్సవానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డిలిహాజరయ్యారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన నీటిపారుదల శాఖ అధికార ఎస్.పి.సి శ్రీనివాసరావు దంపతులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. బండ్ల సాయి సాకేత్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల శాఖలో ఎన్నో సేవలను అందించి నేడు పదవి విరమణ పొందుతున్న శ్రీనివాస రావు శేష జీవితం వారి కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు మోహన్ రెడ్డి, నవీన్ రెడ్డి, రంగస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ డిక్లరేషన్‌ను అమలుపరచాలి

**42% రిజర్వేషన్లు పెంచి స్థానిక ఎన్నికలను నిర్వహించాలి - నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గోంగళ్ళ రంజిత్ కుమార్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(నమస్తే ఉదయం):** నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా చైర్మన్ గోంగళ్ళ రంజిత్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన జరిపి బీసీలకు స్థానిక ఎన్నికలలో 42 శాతానికి రిజర్వేషన్ పెంచి ఆరు నెలల లోపు అమలు చేస్తామని రాహుల్ గాంధీ స్వయానా బీసీ కమీషన్ ఆధారంగా బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని కామారెడ్డిలో ప్రకటించారని పేర్కొన్నారు.

కానీ నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా కూడా దీని విషయమై ముందడుగు పడటం లేదని ఇచ్చిన హామీ ప్రకారం నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీసీ కమీషన్ నివేదిక ఆధారంగా 42 శాతానికి బీసీలకు రిజర్వేషన్ పెంచిన పిమ్మటనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ ప్రకారం కుల గణన జరిపి స్థానిక ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ పెంచాలని, అప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం ఉంటుందని లేని పక్షంలో బీసీలపై మీకున్న ఉన్న కపట ప్రేమ అర్థం అవుతుందని అన్నారు. అలాగే ఒకవేళ బీసీలకు 42% కనుక రిజర్వేషన్ పెంచినట్లయితే దాదాపు ఇరవై



వేల మందికి పైగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు,జిల్లా నాయకులు వెంకట్రాములు మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు, మల్దకల్ మండల నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంఘ సేవకుడు శ్రీధర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు కేక్ తినిపిస్తున్న స్నేహితులు, పడమటి శ్రీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఈఓ రామ్ రెడ్డి

# ఘనంగా సంఘ సేవకుడు పడమటి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పడమటి శ్రీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, స్నేహితులు**

**రాజేంద్రనగర్, జూలై 31(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లికి చెందిన సంఘ సేవకుడు పడమటి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం పడమటి శ్రీధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా మన అభిమానులు, స్నేహితులు ఆయన చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పడమటి శ్రీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామ్ రెడ్డి, స్థానిక నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఇంద్రారెడ్డి, దయానంద రెడ్డి , జీవన్ దాస్ , సురేష్ నాగిన్ , సుభాష్ , సదాల వెంకట్ రెడ్డి , పిట్టల మధుసూదన్, శ్రీనివాస్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# మూసాపేట్ సర్కిల్‌లో ఉన్న సమస్యలపై జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్‌ని కలిసి వినతిపత్రం అందించిన శానిటేషన్ సిబ్బంది

**కూకట్‌పల్లి, జూలై 31 (నమస్తే ఉదయం):** మూసాపేట్ సర్కిల్ పరిధిలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు తెలంగాణ జిహెచ్ఎంసి ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఇలమ్ చిరంజీవి ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందితో మర్యాదపూర్వం కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా సానిటేషన్ కు సంబంధించిన సామాగ్రి (చీపురు కట్టలు, బ్లీచింగ్, సున్నం, పారలు, గంపలు, రేకులు, కొడవాళ్లు) ఇవ్వడం లేదని దయచేసి మీరు చొరవ తీసుకొని గత ఆరు నెలలకు సంబంధించిన సామాగ్రి మొత్తం



ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన కార్మికులకు ఎస్ఎఫ్ఏలకు, బిఎల్వోలుగా పనిచేసిన సిబ్బందికి, కొంతమంది ఎస్ఎఫ్ఏలో రూట్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన వారికి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన డబ్బులు ఇవ్వలేదని దయచేసి ఇప్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో హోజ్జ నర్సింహా, రమేష్, సాయి కుమార్, లక్ష్మి పవన్, క్రిష్ణ, కుమార్, దేవరాజ్, మల్లికార్జున్, మల్లేష్ సంజీవ్ కుమార్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733